మతిమాలిన వైద్యం

శ్రీ పోతుకూచి సాంబశివరావు

డాక్టరుగారు బొజ్జనిమురుకుంటూ ఆవలించారు. భోజనం చేసి, మిట్టమధ్యాహ్నపు బయటి ఎండ మిటమిట లాడుతున్నా యింటిముందరి తాటాకులపందిరి గాలిని చల్లబరచి డాక్టరుగారికి హాయిని గలిగించింది. ముప్ఫయి సంవత్సరాలు ఆవూళ్ళో డాక్టరుగా పనిచేసి, చక్కటి ఆర్జనచేసి అందరి గౌరవం పొంది తనకుటుంబాన్ని తరతరాలవరకు సుఖంగా బ్రతకగలిగే స్థిరాస్థి సంపాదించారు. ఆయన ఈ యాభయ్యోపడిలో కొడుకకూడా యం.బి.బి.యస్. చదివి తన వృత్తిలో సహాయం చెయ్యడానికి యింటికి వచ్చాడు.

డాక్టరుగారి జీవితంలో అంతా పరిపూర్ణత ఉన్నట్లనిపించింది. కావలసినంత ధనం, చుట్టుప్రక్కల వూళ్ళలో ప్రతీచోట ఎంతో పరపతి - అణగి మణగి భయ భక్తులతో మెలగే సేవకులు, ఎదురాడి ఎరుగని సంతానం కుటుంబం- ఆదరించే బంధుజనం యివన్నీ తలుచుకోగానే డాక్టరుగారి జీవితం సార్థకం పొందినట్లయింది. ఇంతకంటె కావలసిందేముంది? ఏమీ లేదనిపించింది.

మేడమీద నుంచుని కిటికీ ఊచలమధ్య నుంచి బయటికి చూశారు డాక్టరుగారు. దూరాన నిర్మల నీరాలతో నిండుగా ఉన్న కాళింగు చెరువు- ఆ ఒడ్డునే స్వార్జితంతో కట్టిన పెద్ద ఆసుపత్రి - కనిపించాయి. తన విజయజీవితం తలుచుకోగానే డాక్టరుగారికి ఆనందాశ్రువులు రాలాయి.

నిజంగా జీవితంలో యింత సంపాదనా పరుడవటానికి కారణం డాక్టరుగారు పిచ్చివాళ్ళ వైద్యంలో చేసిన ప్రత్యేక కృషి. ఎంతోమంది పిచ్చివాళ్ళు దేశంలోని ఎన్నో ప్రాంతాలనుంచి వచ్చి ఆయన చికిత్సవల్ల నయం పొంది వెళ్ళారు. ఆయన ఖ్యాతి చాలా దూరం ప్రాకిపోయింది. జీవితానికి విలువ యిచ్చే మనస్సుకు మందుపోసి స్థిరత్వం తెప్పించే ప్రత్యేకశక్తి ఆయనకు చేతనవును ఆ శక్తికే ఆయనకు అందరూ జోహారు లర్పిస్తారు. ఎన్నో చితికిన జీవితాలకు ఆయన చికిత్సచేసి చైతన్యం కలిగించారు.

ఆవూళ్ళో యింకా ఎంతోమంది వైద్యులున్నారు. కాని డాక్టరుగారి వృత్తితో పోటీ చెయ్యలేక పోయారు ఎవరూ. మానవ హృదయాలను స్పందింప చేయకలిగే మతి చికిత్స ఆయనకు తెలియడంవల్ల, తక్కువ తరగతుల రోగులుకూడా ఆయనలో ఏదో వింత చేతి చలవ ఉందని మందుకు వచ్చేవారు. అందుకే డాక్టరుగారి ప్రతిభ దివిటీలా వెలుగుతోంది.

తన కొడుకును కూడా తనవంటి మంచి డాక్టరుగా తయారు చెయ్యకలిగితే, తన జీవితాశయం పూర్తిగా నెరవేరినట్లే. కొడుకుమీద ఎంతో అభిమానం పుట్టుక వచ్చింది డాక్టరుగారికి

“గోపాల్” అని పిలిచారు ఆయన ఆప్యాయంతో.

వార్తా పత్రిక చదువుతున్న గోపాల్ వినయ విధేయతలతో తండ్రి ఎదురుగా వచ్చి నుంచున్నాడు. ఏమిటి అన్నట్లు ప్రశ్నార్థకంగా.

‘ఈ సాయంత్రం కాంతారావు గారిఅమ్మాయి ఆరోగ్యం ఎలావుందో చూసిరా. మొన్న నాకు టైఫాయిడని అనుమానం తట్టింది’

‘అట్లాగే నాన్నగారూ!’ ముక్తసరిగా అని గోపాల్ లోపలికి వెళ్ళిపోయాడు. ఆమాటలు అనకుండానే అతని ప్రవర్తనలో అంగీకారం కనిపిస్తుంది. పుష్టిశరీరం - పచ్చని రంగు - ప్రశాంతమైన కళ్ళలో నల్లటిపాపలు- మందస్మిత వదనం - సహజమైన ముభావం, అతనిలో నెమ్మది అణకువ తొణికిసలాడిస్తుంటాయి. వయస్సు ఇరవై అయిదు సంవత్సరాలున్నా, వ్యక్తిత్వం, స్వాతంత్ర్యం మాత్రం తండ్రి ముందు, ప్రయోగించలేదు.

తన కొడుకుకూడా పిచ్చివాళ్ళ వైద్యంలో ఆరితేరిన చెయ్యిగా మారగలిగితే, డాక్టరుగారు యింక ఆశించ గలిగింది ఏమీలేదు. ఈ ఆలోచనైనా కొడుకు అభివృద్ధి కోసమే. అందరికీ తెలియని ఒకపనిలో నేర్పరితనం పొందుతే, అందుకనే కీర్తి సంపదలు అపరిమితం.

ఆలోచనల ఆనందంతో డాక్టరుగారు ఒక కునుకుతీసి లేచారు. ముఖప్రక్షాళన అనంతరం, తెల్లటిపంచ, చొక్కా తొడుక్కుని, చేతికర్ర ఊపుకుంటూ వైద్యాలయం వైపు నడిచారు.

ఆసుపత్రి జనంతో కిటకిట లాడుతోంది. జ్వరాలతో, నీరసాలతో, కళ్ళరోగాలతో, పళ్ళబాధలతో, మతి భ్రష్టత్వంతో, నలిగి కుమిలి పోతున్న జనప్రవాహానికి ఆ ఆసుపత్రి ఒక ఆనకట్టలా అడ్డుకున్నట్లు కనిపిస్తున్నది. ఆసుపత్రికి దక్షిణ భాగాన కట్టిన పాతిక గదులలో ప్రపంచ స్పృహలేక విచిత్రంగా అరుస్తూ, సణుగుకుంటూ, అల్లరి చేస్తున్న పిచ్చివాళ్ళను, అక్కడకు వచ్చిన జనమంతా, మ్యూజియంలోని వింతమృగాలను పరిక్షిస్తున్నట్లు ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవిచేసుకుని చూస్తున్నారు. వారి మతి చెడిన చేష్టలు జాలితోకూడిన ఆనందం కల్గ చేస్తున్నాయి ప్రేక్షకులకు.

డాక్టరుగారు ఆసుపత్రి ఆవరణలో అడుగు పెట్టగానే జనమంతా లేచినుంచున్నారు. దగ్గరకు రాగానే అందరూ నమస్కారాలతో ఆయన్ను ముంచేశారు. ఆనందంతో కుశల ప్రశ్నలువేస్తూ డాక్టరుగారు కుర్చీలో చేరగిలబడ్డారు. రోగులకు మందులు పంపే కార్యక్రమం చూడడానికి.

కాంపౌండరు శ్రీనివాసు రోగుల మందుల పట్టిక డాక్టరుగార ముందు పెట్టాడు. డాక్టరుగారు రోగులను ఒకరి తర్వాత ఒకరిని పరీక్షించారు. వారు చెప్పిన విషయాలన్నీ పూర్తిగా వినకుండానే మందులు వ్రాసి పంపించేశారు. చూడగానే రోగులబాధలు తెలుసుకోగలిగే డాక్టరుగారికి, వారి విలాపాలు వినే అవసరం ఉండేదికాదు. ఆసుపత్రికి వచ్చిన రోగులంతా మందులుతీసుకుని క్రమంగా వెళ్ళిపోయారు.

సాయంత్రం ఆరుగంటలయింది. పిచ్చివాళ్ళ కేకలు డాక్టరుగారి చెవుల్లో గింగురు మంటున్నాయి. వాళ్ళందరికీ మందుయిచ్చేసైమయింది. డాక్టరుగారు యీ పని పూర్తిచేయాలని లేచారు.

ఆసుపత్రి ముందు జట్కా ఆగింది. గోపాల్ మందుల సంచీ చేత్తో పుచ్చుకుని లోపల అడుగుపెట్టాడు. వెనకాలనే పొట్టిగా బొద్దుగా ఒకాయన గోపాల్‌ను అనుసరించాడు.

"కాంతారావుగారా! ఎల్లావుంది మీ అమ్మాయికి" ఆయన్ని ఆహ్వానిస్తూ కొడుకువైపు చూశారు డాక్టరుగారు సమాధానం కోసం.

'నిన్నటి కంటె యీవేళ జ్వరం యెక్కువయింది వారి అమ్మాయికి. జ్వరతీవ్రతవల్ల స్పృహలేక ఏదో పలవరిస్తోంది. మీతో యీ సంగతి చెప్పాకగాని మందు ఏమీయివ్వడం మంచిది కాదని వచ్చేశాను. మామూలు ధోరణిలో రోగి సంగతి వల్లించాడు గోపాల్'

"డాక్టరుగారూ! అమ్మాయికి జ్వరం అంత తీవ్రంగా వస్తుందను కోలేదు. మాకేమీ తోచటంలేదు. మీరే ఒకసారి వచ్చి చూస్తే బాగుంటుంది.' ప్రాధేయ పడ్డారు కాంతారావుగారు.

"ఇప్పుడే మావాడు చూసి వచ్చాడుగా! మందిస్తాను. రేపువచ్చి చూస్తాలెండి!" అన్నారు డాక్టరుగారు సాయంత్రం బయటికి కదిలితే ఆసుపత్రిలో యింకా చెయ్యవలసిన పనులు అడ్డిపోతాయేమోనని. అదీకాక ఆ సాయంత్రం గోపాల్‌ను పిచ్చివాళ్ళ దగ్గరికి తీసుకువెళ్ళి వాళ్ళ రోగ రహస్యాలు, వింతప్రకృతులు విపులీకరించి చెప్పి, అతనికి ఆ వైద్యంలో కొంత తర్ఫీదులు యివ్వాలని సంకల్పించుకున్నారు. ఈ సంకల్పానికి అంతరాయం కలిగింది.

"అలా అంటే కాదండి. తమరువచ్చి ఒక్కసారి చూస్తే మాకుధైర్యం. అబ్బాయిగారు చూశారుకాని ...." అంటూ కాంతారావుగారు నమిలి వేశారు. ఆఖరి మాటలు.

డాక్టరుగారికి అర్ధమయింది. క్రొత్తగా వైద్యంలో ప్రవేశించిన కొడుకుపై, తనమీద ఉన్నంత విశ్వాసం,

కాంతారావుగారికి లేనట్లు కనిపించింది. అది సహజంకాదని ఎవరనగలరు?

'సరే పదండి! అంటూ డాక్టరుగారు ఎదురు సమాధానం మళ్ళీ చెప్పలేక, కండువా బుజాన వేసుకుని చేతికర్ర పుచ్చుకున్నారు ఊతగా.

కాంపౌండరు శ్రీనివాసు ఎదురుగా వచ్చాడు పిచ్చివాళ్ళకు మందు యివ్వడం సంగతి ఏమిటన్నట్లు. డాక్టరుగారంటే పిచ్చివాళ్ళకు భయం. ఆయన కేకవేసి మందు యిస్తే అందరూ తాగుతారు. లేకపోతే ఎంతో రసాభాస చేస్తారు. డాక్టరుగారికి అందరి రోగులను చూడడం ఒక ఎత్తు. పిచ్చివాళ్ళకు చికిత్స చేయడం ఒకఎత్తు. ఎందుచేతంటే, పిచ్చివాళ్ళను పరీక్షిస్తున్నప్పుడు ఆయనలో ప్రత్యేక శ్రద్ధాసక్తులు, మానవత్వ పరిశోధనాశక్తి ద్యోతకమవుతూంటాయి కాని కాంతారావుగారి అమ్మాయి పరిస్థితి ప్రమాదంగా ఉండడంవల్ల తప్పనిసరిగా డాక్టరుగారు బయటికి వెళ్ళవలసి వచ్చింది.

'గోపాల్, యీ వేళ సాయంత్రం పిచ్చి వాళ్ళందరికి మందు నువ్వుయిప్పించు. శ్రీనివాసు అన్నీ నీకు చెబుతాడు అంటూ డాక్టరుగారు జట్కాలో ఎక్కి కూర్చున్నారు. కాంతారావుగారి వదనం చాలా ప్రసన్నమయింది.

'మరేమీ అనుకోకండి. శ్రమయిచ్చాను అబ్బాయి గారికి అనుభవం కొంచెం తక్కువగాఅంటూ కాంతారావు గారు సమిలేశారు మాటలు. ఈ ఆరోపణ డాక్టరుగారికి లోపల ఒక విధంగా బాధకలిగించినా, పైకి మామూలుగా ఒక నవ్వుతో ఆసంభాషణ అంతం చేశారు. జట్కా టకటక మంటూ కదిలి పోయింది.

తనజీవితంలో మొదటిసారిగా గోపాల్‌కు, పిచ్చివాళ్ళను సముదాయించి మందు యివ్వవలసి వచ్చింది. చిన్నప్పటినుంచి పిచ్చివాళ్ళంటే గోపాల్‌కు ఒక వింత భయం, పిరికితనం కూడా. పదేళ్ళకుర్రాడుగా ఉన్నప్పుడు ఒక పిచ్చివాడు కాళ్ళ సంకెళ్ళు వదిలించుకుని ఒకరోజు గోపాల్ గదిలో చొరబడి అతన్ని కొట్టినంత పనిచేశాడు. అప్పటినుంచి పిచ్చి వాళ్ళంటే దూరంగా ఉండడం అలవాటైపోయింది గోపాల్‌కు. ఇంటిప్రక్కనే ఉన్న ఆసుపత్రికి కూడా ఎప్పుడూ వెళ్ళేవాడు కాదు. ఎప్పుడైనా వెళ్ళబుద్ధి కలిగినా తండ్రి 'అనవసరంగా వచ్చావేమ'ని కేక లేస్తాడేమో అనిజంకే వాడు.

కొంచెం జ్ఞానం వచ్చాక పిచ్చివాళ్ళంటే భయంపోయి, జాలి, విచారం, కలిగేవి గోపాల్‌కు. పిచ్చివాళ్ళను గొలుసులతో కట్టి, గదిలో ఒకమూల చీకట్లమధ్య బంధించి, బలవంతాన నోరు పెకలించి మందులుపోసి, త్రాగకపోతే కొరడాలతో కొట్టి, ఆసుపత్రిలో జరిపే బీభత్సదృశ్యాలు గోపాల్‌కు చాలా హృదయవిదారకంగా ఉండేవి. ఒక్కొక్కసారి మాగ పిచ్చి వాళ్ళను బంట్రోతు సూరయ్య కొరడా చేతిలో పట్టుకుని షికారుకు తీసుకు వెడుతుంటే మేకలమందలా మందకొడిగా నడుస్తున్న పిచ్చివాళ్ళ వింత ఆకారాలు గోపాల్ హృదయాన్ని ద్రవింపజేసేవి. వారిలో మానవత్వ చైతన్యం నశించి నట్టనిపించేది. పిచ్చికి కారణమేమిటి? మనకుత్సిత సమాజంలో వీరి స్థానంఏమిటి? అను భావాలు అతనిలో కలిగేవి. మానసిక దౌర్బల్యాల వల్ల మనస్థిమితము చెడి జీవితాలు నాశనమయిన వారి వింత ప్రకృతులు పరిశీలిస్తూంటే గోపాల్‌కు ఏదో వింత భయం జాలి, ఆవేదన కలిగేది.

డాక్టరుగారు జట్కాఎక్కి వెళ్ళిపోయాక, కాంపౌండరు శ్రీనివాసు మందుల సీసాలు సూరయ్యచే తెప్పించారు. ఆలోచనలతో ఆసుపత్రి ఆవరణలో స్తబ్దుడై నిలుచున్న గోపాల్ కాంపౌండరు శ్రీనివాసు వచ్చి పలకరించే దాకా కదలలేదు మందుల సామానుతో ప్రత్యక్షమయిన వారిద్దరినీ చూడగానే పిచ్చివాళ్ళ గదులవైపు నడిచాడు అతను.

"ఈయన అవధానిగారు. ఎలకపాడునుంచి వచ్చారు" అంటూ శ్రీనివాసు ఒక పిచ్చివానిని చూపించారు. గోపాల్ ఆయనవైపు తేరిపారి చూశాడు. మాసిన గెడ్డం, వ్రేళ్ళాడే పిలక, మోకాలు దాకా అంగవస్త్రం, గదిలో ఒకమూల కూర్చుని గోళ్ళు చూసుకుంటూ తనవైపు అదో పరధ్యాన్నంగా చూసిమళ్ళీ తలదించేసుకున్నాడు.

తనముఖానికి, అవధాని మాగకి పిచ్చికి తేడా ఏమిటి? అనే ప్రశ్న గోపాల్ ముందు అవతరించింది.

మతిమాలిన వైద్యం

"ఏమండి? ఈయనకు ఆరోగ్యం రావడానికి యింకా ఎన్నాళ్ళు పడుతుంది. ఆసుపత్రికి తీసుకువచ్చి అప్పుడే రెండు నెలలయింది" అంటూ వలవలా ఏడ్చింది ద్వారబంధం వద్ద మాసినకోకతో కంటతడి తుడుచుకుంటూ ఒకస్త్రీ.

"ఫరవాలేదమ్మా" త్వరలోనే నయమవుతుంది. అంటూ శ్రీనివాసు ఒక గ్లాసులో మందుపోసి అవధానికి అందించాడు.

శ్రీనివాసు ఇచ్చేమందు గ్లాసు అవధాని అందుకోలేదు. బలవంతాన చేతిలో గ్లాసు పెట్టి బిగబెడితే గ్లాసుపట్టుకుని ఊరుకున్నాడు. మందు త్రాగమని బలవంతాన నోటిదాక గ్లాసు పెడితే, ఏదో పరధ్యాన్నంగా శ్రీనివాసు వైపు చూస్తూ కూర్చున్నాడు. "మందు తాగవయ్యా" అంటూ శ్రీనివాసు కేకలేశాడు. అవధాని మెదలలేదు. "త్రాగుతావా తన్నమన్నావా" అంటూ చెమ్కీకర్రతో ఒక్కటి కొట్టాడు శ్రీనివాసు. ఉలిక్కిపడి చేతిలోని గ్లాసు క్రిందకు జారవిడిచాడు, అవధాని. గ్లాసు ముక్కలయింది.

శరీరంమీద తేలినట్టు బిత్తర చూపులతో చూసుకుంటూ మౌనంగా ఏడ్చాడు అవధాని. భార్య పక్కకు పోయి ఆ దృశ్యంచూడలేక ఏడ్చింది. కొట్టినా తిట్టినా అవధాని నోటివెంట "ఆ, ఉ ఓ" తప్ప ఒక్క మాటైనా రాదు.

గోపాల్‌కు అవధాని పరిస్థితి చూస్తుంటే కళ్ళవెంట నీరు కారింది. శ్రీనివాసు స్వయంగా అవధాని దగ్గరకు వెళ్ళి మందిచ్చాడు. భయపడుతూ అవధాని యీ మాటు త్రాగాడు.

గోపాల్ మరొక గదివైపు నడిచాడు.

"ఈయన శాస్త్రిగారు" బందరునుంచి వచ్చారు. మరొక పిచ్చివానిని చూపించాడు శ్రీనివాసు యథాలాపంగా.

"తెల్సా బీటూగామా! నీ నెత్తిమీద ఎన్ని వెంట్రుకలున్నాయో అన్ని అంకెలు నాకుకనిపిస్తాయి. మీ కేమీ వచ్చునర్రా, వెధవల్లారా లెక్కలు! నేనా వేళ్ళు లెక్కపెట్టి నక్షత్రాల సంఖ్య ఒక్కసారిగా చెబుతాను" అంటూ తనలో నవ్వుకుంటో అరుస్తున్నాడు శాస్త్రి.

"శాస్త్రిగారు! కొంచెం మందు తీసుకోండి" అని శ్రీనివాసు మందు అందించాడు.

"ఏడిసారు వెధవల్లారా! మందెందుకు? నాకు పిచ్చేమిటి? మీకుగాని. శివుడిలాగ గరాళంకూడా మింగేయగలనురా. ఇలాతే" అంటూ గబుక్కున మందు మింగేశాడు శాస్త్రి

గోపాల్ ఆలోచనలతో మళ్ళీ ముందడుగు వేశాడు. ఇక ముందు ఈ పిచ్చివాళ్ళతో తనజీవితం గడపాలి. వారికి తన మందువల్ల మనస్థైర్యం తెప్పించాలి. ఇదేదో విచిత్రంగా తోచింది గోపాల్‌కు.

"ఈ శాస్త్రిగారికి నల్లక్షరాలున్న కాగితం కనిపించకుండా చెయ్యాలి. ఏదైనా కనిపిస్తే, అది చదువుతున్నట్లు గంటలతరబడి చేతిలో కాగితం పెట్టుకుని తల ఊగించేస్తుంటాడు. మితిమీరిన చదువువల్ల బుర్ర వేడెక్కి మనస్సు చెడింది" శ్రీనివాసు చేసిన వ్యాఖ్యానం విని తిరిగి ఆలోచనలో పడ్డాడు గోపాల్.

"ఈ అమ్మాయి పేరు లలిత, అన్నాడు శ్రీనివాసు మరొక గదిముందు. అప్పటివరకు ఏదో అరుస్తున్న ఆ అమ్మాయి ఒక్కసారిగా మాట్లాడడం మానేసి గోపాల్ వైపు తేరిపారి చూస్తోంది తీవ్రంగా. నాజూకుగా బక్క పలచగా, పెద్దపెద్ద కళ్ళతో మెరిసిపోతున్న ఆ అమ్మాయి ఒకవిధమైన అందకత్తె అని చెప్పవచ్చు. మతిస్థిరం లేనందువల్లకొంచెం శరీర పోషణ సరిగాలేకపోయినా ఆమెలో ఏమీ పెద్ద అసహ్యాకర లక్షణాలు కనుపించలేదు గోపాల్‌కు.

ఒక్కసారిగా లలిత గోపాల్‌ను చూసి పెద్ద పెట్టుగా నవ్వింది "వచ్చావా! హ హ హ. రా, నీ కోసమే చూస్తున్నాను. మనిద్దరం పెళ్ళి చేసుకుందాం. నాకు మా వాళ్ళు చచ్చినా పెళ్ళి చెయ్యరుగా! మనిద్దరం పక్షుల్లాగ ఆకాశంలోకి ఎగిరి పోదాం. ఏం! హ హ హ" అంటో వెకిలిగా నవ్వసాగింది ఆమె. గోపాల్ మొదట ఆశ్చర్యంగా ఆమెకేసి చూశాడు కంగారుతో.

"మరేమనుకోకండి. పాతికేళ్ళు వచ్చినా, డబ్బులేక, ఆమె తల్లిదండ్రులు పెళ్ళి చెయ్యలేదీమెకు. దాని పర్యవసానం ఇది" అంటూ వాఖ్యానించాడు శ్రీనివాసు.

గ్లాసులో మందుపోసి అందించాడు శ్రీనివాసు. మందు చూడగానే వెనక్కు ముడుచుకు పోయింది లలిత. "నేను తాగనర్రోయి, నాకు విషం యిస్తున్నార్రోయి. నాకు పెళ్ళి చెయ్యకుండా చంపుదామనుకుంటున్నారా! అంటూ కాళ్ళూ చేతులు నేలను కొట్టుకుంటూ గల్లంతు వేసింది ఆ అమ్మాయి. శ్రీనివాసు బంట్రోతు సూరయ్య కలిసి ఆమె నోట్లో బలవంతంగా మందు పోసారు.

ఇంకా పిచ్చివాళ్ళ గదులు ఎన్నో ముందు కనిపించాయి. కేకలు, పెడబొబ్బలు, ఏడ్పులు, గుసగుసలు, వినిపిస్తున్నాయి గోపాల్‌కు. మగతనిద్రలోని కలలులా, పిచ్చివాళ్ళ స్థితులు మసకమసకగా కళ్ళముందు తిరుగుతున్నాయి.

"ఆ ముందు గదుల్లో యింకా యిద్దరుపిచ్చివాళ్ళున్నారు. ప్రేమించిన స్త్రీ పెళ్ళి చేసుకోలేదని ఒకడికి మతి చెడింది. మరొకడు తనభార్య లేచి పోయిందనే బాధతో మతిచెడ గొట్టుకున్నాడు ఈ పిచ్చివాళ్ళంతా చాలా విచిత్రంగా ఉంటారండి. మీ నాన్నగారు కాబట్టి ఇవన్నీ కుదురుస్తూ నెగ్గుకొస్తున్నారు, గబగబా వల్లించాడు శ్రీనివాసు.

గోపాల్ ఆసుపత్రి విడిచి, కాళింగా చెరువు ఉత్తర భాగానికి పోయి ఒక పొలం గట్టుమీద కూర్చున్నాడు, మనశ్శాంతికోసం. డాక్టరు పరీక్ష చదవాలని గోపాల్‌కు స్వతహాగా యిష్టంలేదు. డాక్టరుపని తప్ప మరేదైనా సరే అతను సరదాగా చెయ్యగలడు. తన వృత్తికి ఆధారం ఒకడుండాలని తండ్రి తన్ను డాక్టరు పరీక్ష చదివించాడు. తండ్రి సంతృప్తి కోసమే తన చదువు పూర్తి చేశాడు గోపాల్.

నరకయాతన అనుభవిస్తున్న నానా రకాల రోగులు హృదయాలను ద్రవింపజేసే శోకాలతో మూర్తీభవిస్తున్న వివిధ రకాల పిచ్చివాళ్ళు, కసాయివాడిలా శరీరాలు కోసి ఆపరేషనులు చేసి, సూదులతో నిర్దయగా పొడిచే డాక్టరు వృత్తిలోని కాఠిన్యత యివన్నిటినీ తన ప్రకృతి తట్టుకుని నిలబడ కలిగేటట్టు కనిపించడంలేదు. యింక సేవా తత్పరతలో కఠిన హృదయం ఉండాలి డాక్టరుకు. అది తనకున్నట్లు కనిపించదు.

ఎద్దులేక, పాలుయిచ్చే గేదెలను బలవంతానకట్టి అరకదున్నుతున్నాడు ప్రక్క పొలంలో ఒక రైతు సాయంత్రం పిల్లగాలుల్లో కాళింగు చెరువులోని. కలువతుండులు ఊగిసలాడుతు అల్లాలాడుతున్నాయి. సూర్యాస్తమయంతో పడమటి ఎఱుపునలుపుల కాంతిలో గంధం కుంకుమలు కగ్గిన బ్రాహ్మణుని ముఖంలా వుంది. తన కిష్టంలేని వైద్యవృత్తి చేయడం ఎలా? వైద్యవృత్తిలో కనుపించే రోగులు తన హృదయాన్ని ద్రవింపజేస్తూ, శక్తిహీనుణ్ణిగా చేస్తూంటే ధైర్యంతో రోగనివారణ ఎలా చెయ్యగలను? సాయంత్రం పిచ్చివాళ్ళకు మందుయిప్పించ నందుకు తండ్రి ఏమంటాడో ఆలోచనా భారంతో ఒక నిట్టూర్పు విడిచాడు గోపాల్.

చీకట్లు కమ్ముకుంటూంటే లేచియింటికి వెళ్ళిపోయాడు గోపాల్. డాక్టరుగారు వరండాలో ఎవరితోనో మాట్లాడుతున్నారు. గోపాల్‌కేసి చూసి ముభావంగా తనప్రక్కకు త్రిప్పుకున్నారు.

వరండాలోని పెద్దమనుష్యులు వెళ్ళిపోయాక డాక్టరుగారు గోపాల్‌ను పిలిచారు అతనువచ్చి పిల్లిగా నుంచున్నాడు తండ్రి కెదురుగా.

'సాయంత్రం పిచ్చివాళ్ళకు మందులు ఇవ్వలేదుట' గోపాల్‌కు అర్థమయింది కాంపౌండరు అప్పుడే వార్త అందించినట్లు.

'మనం చేసుకునే వృత్తిలో శ్రద్ధాసక్తులు లేకపోతే, ముందు అభివృద్ధి ఉండదు.

మౌనంగా వింటూన్నాడు గోపాల్.

'నేను వైద్య వృత్తిలో సంపాదించిన పరపతి ప్రాక్టీసు నిలబెట్టుకునే భాద్యత నీమీద ఉంది' గోపాల్ వైపు చూడకుండా కటువుగా అన్నారు డాక్టరుగారు.

జ్ఞానమెరిగిన ఎదిగిన కొడుకుకు అంతకన్నా ఎక్కువగా చెప్పనక్కర్లేదని డాక్టరుగారి ఉద్దేశ్యం, అంతటితో సంభాషణ అంతమయిందని లోపలికివెళ్ళి పోయాడు గోపాల్.

భోజనంచేసి పక్కపై మేనువాల్చాడు గోపాల్. జీవితంలోని సగంకాలంపైగా పిచ్చివాళ్ళ సహచర్యంతో గడపాలి. బాధితులను మామూలుగా చూడగానే హృద

యం భారం ఆయేవారికి బాధితుల బాధలమధ్య జీవితం గడపడం భరించరాని విషయం. ఆవేదనలకు ఆనకట్టల్లు లేకపోతే అవి వారి జీవితాలనే అంతం చేస్తాయి. తలుచుకుంటుంటే పిచ్చివాళ్ళ వైద్యం చెయ్యడం తనకు చేతకానట్టు తోచింది గోపాల్‌కు.

మాట్లాడగలిగే మూగతో బిత్తర చూపులు చూసే అవధాని, ప్రపంచ స్పృహలేకుండా అంకెలమధ్య విహరిస్తున్న శాస్త్రి, కనిపించినవాడిని భర్తగా అభిలషించే లలిత - వీరి అవస్థలు చూస్తూ దుఃఖంతో కుములుతూ సేవచేస్తున్న వారి బంధుజనం గోపాల్ మనస్సులో మెలితిరిగారు. తనేమూగవాయి అంకెలమధ్య విహరిస్తూ లలిత భర్తగా ఆ ఆసుపత్రిలో తాను విహరిస్తున్నట్లు ఏవో విచిత్ర భావాలు గోపాల్‌కు తట్టాయి. నిత్యమూ ఆసుపత్రిలో ఉంటే అంతకన్నా ఏంకనిపిస్తుంది? జ్వరాలు, నీరసాలు, దగ్గులు, కురుపులు పుళ్ళు తన్నే ఆవరించినట్లు కనిపించింది గోపాల్‌కు. తనవృత్తి తలుచుకుంటూన్న కొలదీ భయం, ఆవేదన హెచ్చిపోయి తల వేడెక్కింది. ఒంటినిండా చెమటలు కమ్మాయి. తనచుట్టూ పిచ్చివాళ్ళు గంతులు వేస్తున్నట్లనిపించింది. ఇంతేనా తనముందు జీవితమంతా? భయంతో వణికిపోయి, తలగడలో తలదూర్చి కళ్ళుమూసుకు బాధ పడ్డాడు గోపాల్.

ప్రొద్దున్న పక్కమీద నుంచి లేస్తూండగానే డాక్టరు గారు గోపాల్ గదిలోకి వచ్చారు.

“నేను ఊరు వెళుతున్నా, సాయంత్రం వస్తా. శ్రీనివాసు నడిగి ఆసుపత్రి విషయాలు జాగ్రత్తగా చూసుకో. కాంతారావుగారి అమ్మాయికి యీ ఇంజక్షను యియ్యి” అంటూ గోపాల్ చేతిలో ఏదో కాగితం పెట్టి తొందరగా వెళ్ళిపోయారు డాక్టరుగారు.

గోపాల్ కాలకృత్యాలు తీర్చుకుని, దుస్తులు వేసుకుని తప్పనిసరిగా కాంతారావుగారింటికి వెళ్ళాడు. ఇంట్లో అడుగుపెట్టగానే వాళ్ళ అమ్మాయి మూల్గు వినిపించింది. జ్వరతీవ్రత చాలా ఎక్కువగా ఉంది. ఒళ్ళు సలసలా కాలిపోతూంది. మంటలో పడిన శలభంలా గిలగిలా తన్నుకుంటోంది. తడి ఆరిపోయేనోరు తపతప లాడిస్తోంది.

థర్మామీటరుతో జ్వరంచూచి, గోపాల్ యింజక్షను సిద్ధం చేశాడు. ఆ అమ్మాయి జ్వరబాధ చూస్తుంటే, ఎదురుగా నిలుచున్న తల్లిదండ్రుల కన్న అతనికి బాధ ఎక్కువైంది. ఆ అమ్మాయి సన్నటి ఎముకల శరీరం ముట్టుకోగానే అతనికాళ్ళు వణికాయి ఇంజక్షన్ ట్యూబ్ ఎత్తగానే చేతులు వణికాయి. అంతసన్నని బక్కపలచని పదేళ్ళ అమ్మాయి లేతశరీరంలోకి ఎలాగా సూదిగుచ్చడం? అది చాలా అసందర్భపు క్రూరకార్యంలా కనిపించింది,

వృత్తిధర్మాన్ని జ్ఞాపకం తెచ్చుకుని, యింజక్షను సూది ఆ అమ్మాయి చేతికండరాల్లోకి గుచ్చాడు. చేతులు వణుకుతూంటే గట్టిగా పట్టి అదిమాడు. చేతులో ట్యూబ్ బ్రద్దలయింది విరిగిన గాజుముక్కలు చేతులో గుచ్చుకున్నాయి. టైపాయిడు బాధతో అవస్థ పడుతున్న ఆ అమ్మాయికి సూదిమొన ఎక్కువ బాధపెట్టడంవల్ల అరిచింది ఆమె. తగిన అనుభవం లేదన్నట్టు గోపాల్ వైపు చిరాకుగా చూసారు ఆమె తలిదండ్రులు. హడావడిగా కూతురు శరీరంమీది గాజుముక్కలు తీసి శుభ్రం చేశారు. ఇంజెక్షను ట్యూబ్ పగులడం గోపాల్‌కు చాలా లజ్జాకరంగా తోచింది. బలవంతాన ఇంజెక్షను సూదిలాగి “సాయంత్రం మా నాన్నగారు వచ్చి యింజక్షను యిస్తారంటూ” కాంతారావుగారి ముఖంచూడలేక తలవంచుకునే బయటికి వచ్చేశాడు గోపాల్.

దించిన తల ఎత్తకుండా జట్కాఎక్కి ఆసుపత్రిముందు దిగాడు గోపాల్. ఆసుపత్రిలో రోగులు కిటకిట లాడుతున్నారు. తిన్నగా చికాకుతో తండ్రి గదిలోకి పోయి కూర్చున్నాడు. తమ ఆరోగ్యాలు ఎల్లావున్నాయని పలకరిస్తాడేమోఅని గోపాల్‌కేసి తేరిపార చూసి రోగులంతా ముఖాలు ముడుచుకున్నారు. “డాక్టరు గారిలా కాదు — ఈయన ఏంత టెక్కు ! ” గుసగుసలు వినిపించాయి.

రోగుల మాటలు వినగానే గోపాల్‌కు కోపం పెరిగింది. ఏంచెయ్యాలో తోచలేదు. శ్రీనివాసుని పిలిచాడు.

“వీళ్ళందరినీ ఏదో విధంగా మందులిచ్చి పంపించెయ్యండి.

“వాళ్ళ ఆరోగ్యం మీరు ఒకసారి పరీక్షిస్తే, వారికి సంతోషంగా ఉంటుంది”

మతిమాలిన వైద్యం

"నే నేం చెయ్యలేనిప్పుడు"

శ్రీనివాసు అంతకన్న యింకేమీ అనలేక్క పోయాడు. స్వతహాగా ముభావము కావడంచే, ఏం చెప్పినా గోపాల్ దగ్గరనుంచి మరోసమాధానం రాదని శ్రీనివాసుకు తెలుసు.

రోగులు మందులు తీసుకుని వెళ్ళిపోయారు. "ఎవరో ఒకరిద్దరు బంట్రోతు సూరయ్యతో మాట్లాడు తున్నారు. కాంతారావుగారి అమ్మాయి విషయంలో జరిగినది నాన్నగారికి తెలిస్తే ఏమనుకుంటారు. ఈ రోగులను పిచ్చివాళ్ళను చూస్తుంటే తనకి అంత అశక్తి, అధైర్యం, ఎందుకు కలుగుతున్నాయి. చదువుకునే రోజుల్లో స్నేహితులతో కలిసి, నవ్వులలో, కేరింతాలలో, ఏదో ప్రయోగాలు చేసి, తర్ఫీదు పొందాడేకాని, వైద్యవృత్తి బాధ్యతతో ఎవరినీ పరీక్షించడం, చికిత్స చేయడం, గోపాల్ ఇదివరలో చేయలేదు. ఇప్పుడు యీ వైద్యవృత్తి జీవితంలో అడుగు పెడుతూంటే అంతా అయోమయంగా బాధాకరంగా ఉంది.

ఆసుపత్రి ఆవరణలో జట్కా ఆగింది తండ్రి వచ్చాడేమో అనుకున్నాడు గోపాల్. ఒక ముసలి దంపతులు దుఃఖిస్తూ రక్తావృతమైన కుర్రాడి శరీరం జట్కాలోంచి దించారు. బంట్రోతు సూరయ్య గబగబా జట్కాదగ్గరికి వెళ్ళి సాయంచేసి ఆ కుర్రాడిని లోపలికి తీసుకువచ్చారు.

"మా అబ్బాయి గుర్రపుబండి కింద పడిపోయాడు. కణతలమీద గాయాలు బాగా తగిలాయి. కళ్ళకు ప్రమాదం కలుగుతుందేమో అనే భయంగా ఉంది. డాక్టరు గారూ మీరే రక్షించాలి. అంటూ ప్రాధేయపడ్డాడు ఆ ముసలాయన. కుర్రాడిని ముట్టుకోడానికి గోపాల్‌కు భయంకలుగుతున్నా, ముసలాయన ప్రార్ధనవల్ల ఆతనికి జాలికలిగింది.

ముఖమంతా ఎరుపురంగు పూసినట్లు రక్తపు గడ్డలతో నిండుకున్న ఆ కుర్రాడి ముఖం చూడగానే గోపాల్ ఒళ్ళు గగుర్పొడిచింది. పరీక్షించి చూస్తే గాయాలు కణతలలో బాగా తగిలాయి, కళ్ళకు నిజంగా ప్రమాదమే, అవసరమైతే ఆపరేషన్ చెయ్యాలేమో! ఆపరేషనంటే అతని చేతులు వణికాయి. బలవంతాన శరీరం కోసి, కండరాలు కెలికి మనిషి చావకుండా తిరిగి తగుకట్లు, కట్టి చికిత్స చేయడం ఏదో చాలా భయంకరంగా కనిపించింది గోపాల్‌కు. తీరామనిషి చచ్చిపోతే బాధ్యత తనది! అందరూ తిడతారు. అందువల్ల కుర్రాడి ముఖం మీది గాయాలకు కట్టు కట్టి ఊరుకుందామను కున్నాడు.

ఆకుర్రాడి రక్తం ముఖంమీది నుంచి కడుగుతూంటే మాంసం కడుగుతున్న కసాయి వాడిలా బాధ పడ్డాడు గోపాల్. అతనికి కాళ్ళు చేతులు వణక సాగాయి. గాయాలు చూస్తుంటే ఒళ్ళంతా చెమటలు పోసింది. వాటిలోని అపరిశుభ్రత తీస్తుంటే ఆ కుర్రాడికి ఎంత బాధ కలుగుతుందో అని జాలి పడ్డాడు గోపాల్.

కట్లు కట్టడం పూర్తి అయింది.

"ప్రస్తుతం ఫర్వాలేదు. సాయంత్రం నాన్నగారు వచ్చి చూస్తారు" అన్నాడు గోపాల్. నిజంగా కుర్రవాడి పరిస్థితి గాయాలవల్ల చాలా ప్రమాదంగా వున్నా, తనేమీ యింక చెయ్యలేననే అధైర్యం కలిగింది గోపాల్‌కు.

సాయంత్రం డాక్టరుగారు ఊరునుంచి వచ్చారు. ఆయన రాకముందే కాంతారావుగారు పదిసార్లు ఆసుపత్రికి వచ్చి వెళ్ళారు. వారి అమ్మాయికి చెయ్యి అంతావాచి పోయింది. ఇంజెక్షను సరిగా యివ్వక పోవడంవల్ల కంగారుతో డాక్టరుగారి కోసం కాంతరావుగారు నిమిష నిమిషానికి పరుగెత్తుకు వస్తున్నారు

ఇంటికి రాగానే డాక్టరుగారికి కొడుకు చేసినపని తెలిసింది. ఉగ్రుడై పోయాడు ఆయన కోపంతో, ముందు కాంతారావుగారింటికి వెళ్ళి ఆ అమ్మాయిని పరీక్షించారు. శరీరంలో ఎగస్వాస వచ్చేసింది. నాడి అందటంలేదు. ఎక్కిళ్ళు తీవ్రంగా పదే పదే వస్తున్నాయి. డాక్టరుగారికి ఆ అమ్మాయి బ్రతుకుతుందనే ఆశకలగలేదు. అధైర్యపడకుండా ఒక ఇంజక్షన్ యిచ్చి దైవాధీన మనుకుంటూ బయటికి వచ్చారు.

"ఎలావుంది డాక్టరుగారు!" ఎదురుగా తొట్రుపాటు తోనుంచున్నారు కాంతారావుగారు.

"చూద్దాం ఏమౌతుందో! అంటూ మెల్లిగా బయటికి వెళ్ళి పోయారు డాక్టరుగారు. ఆ సమాధానంలోని అంతరార్ధం కాంతారావుగారికి తెలిసింది. తన కూతురు చనిపోతూండడానికి కారణం గోపాల్ ఆ యింజక్షనే ప్రొద్దున్న

యిస్తే పిల్లకు నెమ్మదించేది. పైగా యిష్టమొచ్చినట్లు ఒంట్లో పొడిచి పోయాడు. చెయ్యివాచి పిల్లకు ప్రమాదం కలిగింది. అనుకుంటూ గోపాల్ మీద ఎక్కడలేని ఆవేశం తెచ్చుకున్నారు కాంతారావుగారు.

ఆసుపత్రిలో చేర్చిన గాయాల కుర్రాడిని పరీక్షించారు డాక్టరుగారు. కుర్రాడు తలనొప్పి అని, నరాలు లాగేస్తున్నాయని గోలచేస్తూ బాధపడుతున్నాడు. కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయని అరుస్తున్నాడు. కట్లు విప్పి చూశారు డాక్టరుగారు. ఫాలంమీద తగిలినగాయం లోతు కంటిలోకి చొచ్చుకు పోయింది. ఆపరేషను చేసి ఉండవలసింది అనుకున్నారు డాక్టరుగారు. కట్లు విప్పగానే కుర్రాడు అరిచాడు "బాబోయి కళ్ళు కనిపించడంలేదు" డాక్టరుగారు కంగారు పడ్డారు. చూస్తే పిల్లవాడి గుడ్లు లోతుకుదించుకు పోయాయి. ఇప్పుడు ఆపరేషను చేయడం అసంభవం. తెల్లబోయి నుంచున్నారు కాస్సేపు డాక్టరుగారు.

"ఏమండి! యింకమావాడికి కళ్ళు కనిపించవాండి!" అంటూ దీనంగా చేతులు నలుపుతూ నుంచున్నాడు, ఆ ముసలాయన డాక్టరుగారి ముందు.

మౌనంగా తిరిగి కట్లు కట్టేశారు డాక్టరుగారు.

ఆ మౌనంలోని అర్ధం ముసలాయనకు తెలిసింది. ముసలాయన ముసలావిడ, పొంగే దుఃఖంతో, పిలగా ఏడ్వసాగారు.

"విచారించకండి. ప్రయత్నిద్దాం అంటూ డాక్టరు గారు యింటికి వెళ్ళి పోయారు.

రోజల్లాప్రయాణంచేసి నందువల్లబడలిక. ఇంటికిరాగానే కొడుకు తెలివితక్కువవల్ల రెండు కేసులు ప్రమాదించడం, తన వైద్యవృత్తికే దెబ్బతగిలే లావుంది. తనగురించి నలుగురూ ఏమనుకుంటారు? కొడుకు చేసిన తెల్వితక్కువపనికి కోపంతో ఉరుముతూ యింట్లో అడుగు పెట్టారు డాక్టరుగారు.

"గోపాల్! పిడుగు పడ్డట్లు అరిచారు డాక్టరుగారు. మెల్లిగా అడుగులు వేసుకుంటూ ఇంట్లోంచి వచ్చాడు గోపాల్

"ఒక్కపూట ఇంట్లోలేకపోతే ధ్వంసం చేసి వదిలి పెట్టావు కేసులన్నీ"

తలవంచుకున్నాడు గోపాల్.

"పాతికేళ్ళు వచ్చి యం.బి.బి.యస్. చదివిన మనిషి యింత దద్దమ్మలా ప్రవర్తిస్తాడనుకోలేదు."

"కాంతారావుగారిఅమ్మాయి చావుబ్రతుకులమీదఉంది. ఆ గాయాలు తగిలిన కుర్రవాడికి కళ్ళుపోయాయి"

"ఇటువంటి అప్రయోజకుణ్ణి ఆధారం చేసుకోడం నాదే బుద్ధితక్కువ"

గోపాల్ తండ్రి మాటలకు ఎదురు చెప్పలేక సమాధానం ఖిన్నుడై నుంచున్నాడు. ప్రక్కగదిలో తనకోసం ఎవరో పెద్దమనుష్యులున్న సంగతి డాక్టరుగారికి తెలియదు తెలిస్తే కేకలేయక పోయేవారేమో!

ఈలోగా గదిలోంచి బయటికి వచ్చి డాక్టరుగారికి నమస్కారం పెట్టారు ఇద్దరు మనుష్యులు.

"మా అబ్బాయికి వచ్చే బుధవారం పెళ్ళి. తమరు తప్పకరావాలి ముహూర్తం వేళకు అంటూ డాక్టరుగారి చేతిలో శుభలేక పెట్టారువారు.

"తక్షణం ముఖకవళిక మార్చుకుంటూ" అలాగాండి తప్పకవస్తా అన్నారు. డాక్టరుగారు నవ్వుతూ. ఆ పెద్ద మనుష్యులు వెళ్ళిపోయారు.

ఆ పెద్దమనుష్యుల ముందు ఎదిగిన కొడుకును తిట్టినందుకు లోపల బాధపడ్డారు డాక్టరుగారు ఎందుచేతంటే, ఆ పెద్దమనుష్యులు కాంతారావుగారి స్నేహితులు కూడా! పైగా ఆ రెండుకేసులు, గోపాల్ అజాగ్రత్తకన్న రోగలక్షణాలు విషమించే చెడిపోయాయి. అందువల్ల పూర్తిగా గోపాల్ బాధ్యుడు కాదని డాక్టరుగారికి తెలుసు. కాని కేసులు చెడిపోవడం వల్ల, పరపతి పోతుందనే, కోపంతో డాక్టరుగారు కొడుకుపై కేకలేశారు.

ఒంట్లో సరిగాలేదని గోపాల్ ఆరోజురాత్రి భోజనం చేయలేదు.

"ఇటువంటి అప్రయోజకులు ఒకపూటభోజనం చేయ్యకపోతే వచ్చిన నష్టంలేదు" అంటూ చిందులు త్రొక్కారు డాక్టరుగారు.

గోపాల్ ఆనాటిరాత్రి నిశ్చయించుకున్నాడు. ఇకనుంచి జాగ్రత్తగా వైద్యవృత్తి చేసుకోవాలి. కొడుకుమీద కోపం

మతిమాలిన వైద్యం



వచ్చి, డాక్టరుగారు అతనిని ఆసుపత్రికి రమ్మని పిలవటం లేదు కాని గోపాల్ మామూలుగా ఆసుపత్రికి వెడుతూ వస్తున్నాడు, తనకు తండ్రి పని చెప్పినా చెప్పకపోయినా.

కాంతారావుగారి అమ్మాయి ఆమర్నాడే చనిపోయింది తన కూతురు చావుకు కారణం గోపాల్ అని అందరి దగ్గరా వాపోసాగారు, కాంతారావుగారు. అదేవిధంగా ముసలాయన తనకొడుకు కళ్ళు పోవడానికి గోపాల్ కారణమని, అతనే తక్షణం తనకొడుకు కళ్ళకు ఆపరేషను చేసి ఉంటే తనకొడుకుకు అంధత్వం వచ్చేది కాదని నలుగురితో యాగీ చెయసాగాడు.

గోపాల్‌కు యీ మాటలు సూదుల్లా హృదయంలో గ్రుచ్చుకునేవి. తండ్రి అతనిపై చూపే ఉదాసీనత అతనికి మరీ విచారం కలగచేసేది. డాక్టరుగారు కొడుకుపై చూపే నిర్లక్ష్యతవల్ల గోపాల్‌కు ఆయన నౌకర్లలోకూడా గౌరవం తగ్గింది, ఆసుపత్రికి వచ్చిన గోపాల్‌ను ప్రతివాడు చూసీ చూడనట్లు ప్రక్కనుంచి వెళ్ళిపోతూండే వారు.

"ఇకనుంచి జాగ్రత్తగా ఆసుపత్రిలో పని చేస్తానన్నగారూ!" అన్నాడు ఒకరోజు గోపాల్.

"నువ్వు నాకేం సహాయం చెయ్యనక్కరలేదు" కటువుగా కసిరారు డాక్టరుగారు.

గోపాల్ కాసేపుమౌనంగా నుంచుని యింట్లోకి వెళ్ళిపోయాడు.

ఒక వారం రోజులుదాకా తన గదిలోంచి బయటికి రాలేదు. భోంచేసి గదిలో తలుపులు మూసుకుని కూర్చునేవాడు.

ఒకరోజు సాయంత్రం ఆసుపత్రికి వెళ్ళాడు గోపాల్. కాంపౌండరు శ్రీనివాసు సిగరెట్టు తాగుతూ బంట్రోతు సూరయ్యతో కబుర్లు చెబుతున్నాడు. డాక్టరు రోగులను

చూడటానికి ఊళ్ళోకి వెళ్ళారు. పిచ్చివాళ్ళ కేకలు సంతలో రొదల్లా వినిపిస్తున్నాయి. గోపాల్ ఆసుపత్రిలో అడుగు పెట్టినా, కాంపౌండరు కాని, బంట్రోతులుకాని పలకరించ లేదు. గోపాల్ వైపు కళ్ళప్పగించి చూస్తున్నారు. గోపాల్ తిన్నగా పిచ్చివాళ్ళ గదులదగ్గరికి వెళ్ళాడు. "యం.బి. బియస్. చదివేడుట! జ్వరమంటే ఏమిటో తెలియదు. ఏ మందుయివ్వాలో తెలియదు" అంటూ మెల్లగా నవ్వాడు శ్రీనివాసు వెనకనుంచి. ఈ మాటలు వింటూంటే గోపాల్ కు లోలోపల ఉడికిపోయింది. కాని ఏమనకుండా సహజ ముభావంతో ముందడుగు వేశాడు.

పిచ్చివాళ్ళ గదులు లెక్కపెట్టాడు ఇరవై అయిదు ఉన్నాయి. ఒక గది మాత్రం ఖాళీగా ఉంది. తక్కిన వాటన్నిటిలోనూ ఎవరో పిచ్చివాళున్నారు. మామగారు కట్నం యివ్వలేదని పిచ్చెక్కినఅల్లుడు. గయ్యాళిభార్య, పెట్టేబాధల వల్ల మతిపోయినవాడు, పెరిగే సంసారం పోషించలేక బెంగతో పిచ్చెక్కినవాడు, అనేకరకాలు అతనిముందు కనిపించారు. ఏవేవో వాగుతున్నారు. వారి మాటలన్నీ కందిరీగల ధ్వనుల్లా చెవుల్లో మ్రోగుతున్నాయి.

మతిఎందుకు చెడుతుంది? బెంగవల్ల, బాధవల్ల, ఆవేదనవల్ల, స్వేచ్ఛ లేకపోవడం వల్ల నల్గురూఅనే దెప్పుడు మాటలవల్లా స్ప్రింగుతీగల మధ్య నొక్కినట్లు జీవితాలను నలిపేయడంవల్ల యింకా ఎన్నెన్నో కారణాలుండవచ్చు. మొత్తంమీద అధైర్యపు మనస్సులు బలవత్తరమైన బాధలు, ఆవేదనలు, భరించలేక చిదికిపోయి చెడిపోతాయి. అందుకే పిచ్చి, అనుకున్నాడు గోపాల్.

ఆసుపత్రి విడిచి ముందుకువచ్చి కాళింగు చెరువువైపు నడిచాడు గోపాల్. చెరువులో బాగా నాచు పెరిగిపోతోంది. నీరు పసరురంగు దాలుస్తోంది. సరైనప్పుడు అదిపరిశుభ్రం చెయ్యకపోతే చెరువు చెడిపోతుంది. ఆ నీరు త్రాగే వారికి రోగాలు వస్తే కాని, ఆ చెరువు పరిశుభ్రం చెయ్యాలనే బాధ్యత త్రాగేవారికి కలగదు.

చెరువుగట్టున కూర్చున్నాడు గోపాల్. పిచ్చి వాళ్ళు చచ్చిపోయిన కాంతారావు గారి అమ్మాయి. గుడ్డివాడైన గాయాల కుర్రాడు - జ్వరపీడితులు - మందుల కోసం వచ్చినరోగులు - కోపంతో ఉగ్రుడైన తండ్రి - కాంతారావుగారి సూటీపోటీ మాటలు, సేవకుల నిర్లక్ష్యత - అన్నీ ఒక్కసారి గిర్రున తిరిగాయి గోపాల్ మనస్సులో. తనకి యీ ప్రదేశంలో యింకస్థానం లేనట్లు తోచింది. మనస్సులోని బాధ చెప్పుకోడానికి ఆప్తులెవరూ ఉన్నట్లు కనిపించలేదు.

"మా అమ్మాయి నీమూలానే చచ్చిపోయింది."

"మా కుర్రాడు నీమూలానే గ్రుడ్డివాడైయాడు. గోపాల్ చెవులు గింగురుమన్నాయి.

"నన్ను పెళ్ళాడ్డానికి వచ్చావనుకుంటూ" లలిత వెకిలిగా నవ్వింది.

"నీకువచ్చునోయి లెక్కలు. జీవితంలో లోతులు లెక్కపెట్టగలవూ!" శాస్త్రి అరిచాడు.

అవధాని తనకేసి మూగిగా చూస్తున్నాడు.

వీరందరూ తనకేదోబోధ చేస్తున్నట్లు తోచింది గోపాల్ కు. వెర్రిదుఃఖం వచ్చింది. చేతులు ముఖాన అడ్డుపెట్టుకుని ఏడ్చాడు.

తిన్నగా గదిలోకి పోయి పడుకున్నాడు. ఆ రాత్రి భోజనం చెయ్యలేదు గోపాల్. రాత్రి అంతా ఏవో ఆలోచనలే. తనచుట్టు ఏవరో పిచ్చివాళ్ళు తిరుగుతూ గంతులేస్తున్నట్లు - మంచం తిరిగిపోతున్నట్లు ఏవో ఆలోచనలు అతనిలో దొర్లిపోయాయి. కళ్ళుపెద్దవిచేసి యింటికప్పు చూస్తూపడుకొన్నాడు ఒళ్ళు చెమటలు కమ్మాయి. ఒకసారి ఏడ్చాడు. ఒకసారి నవ్వుకున్నాడు. ఒకసారి నిట్టూర్పు విడిచాడు. వీదో కెవ్వున కేక వేశాడు. తనేం చేస్తున్నాడో, ఏంచెయ్యాలో గోపాల్ కి ఏమీ తెలియనట్లు అనిపించింది.

మర్నాడు మధ్యాహ్నందాకా గోపాల్ గది తలుపు తెరవబడలేదు. డాక్టరుగారిభార్య తలుపు తెరచి లోపలికి వెళ్ళింది.

"గోపాల్"

పడుకున్న గోపాల్ కదలలేదు.

"గోపాల్!" ఆమె దగ్గరకువెళ్ళింది. గోపాల్ ఇంటి కప్పువైపు చూస్తున్నాడు తీవ్రంగా.

ఆమెకు గోపాల్ స్థితి చూడగానే భయం కలిగింది. "గోపాల్" అని అరిచింది ఆమె

గోపాల్‌లో చలనంలేదు.

కంగారుగా డాక్టరుగారికి కబురు చేసారు. డాక్టరు గారు ఆసుపత్రినుంచి హడావడిగా వచ్చి ఆత్రంతో "గోపాల్ గోపాల్" అంటూ కుదుపుతూ పలకరించారు.

గోపాల్ మాట్లాడలేదు.

అతన్ని పక్కమీద కూర్చోబెట్టారు. గోపాల్ కప్పు కేసి చూస్తున్నాడు.

డాక్టరుగారికి గుండె దడదడ లాడింది. నాడిచూశారు. బాగానే పనిచేస్తోంది. కాని గోపాల్ శరీరం చెమటలు కక్కుతోంది. కాంపౌండరు శ్రీనివాసును పిల్చి ఏవో మందులు తెమ్మన్నారు తక్షణం.

డాక్టరు గారి భార్య కంటతడి పెట్టింది. ఆయన కుటుంబం అంతా శోకంతో మూర్తీభవించింది.

రెండురోజులు గడిచాయి. గోపాల్ స్థితిలో మార్పు రాలేదు. ఒకరోజు గోపాల్‌కు మందుయిస్తూ "శ్రీనివాస్" అంటు డాక్టరుగారు బాధగా దుఃఖంతో ఏదో సమాధానం కోసం అతనివైపు చూశారు.

ఇరవైఅయిదోగది కాళీగానే ఉందండి.

అది వినగానే డాక్టరుగారి భార్య గొల్లుమంది. చుట్టు ఉన్నవారు తెల్లబోయారు. డాక్టరుగారు, శ్రీనివాసు, ముందుకర్తవ్యం ఆలోచిస్తూ నిర్విణ్ణులై నిలుచుండిపోయారు.

PHILIPS

DIAL 3782

QUALITY
SERVICE
GUARANTEED

RADIOS
RADIO GRAMS
TAPE RECORDERS
AMPLIFIERS
ETC.,

G. K. SYNDICATE Ltd.,
119 ARMENIAN St.
MADRAS I.